సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 31 । మే । 2025



డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

అన్నమయ్య జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేలా అధికారులు, పోలీసు శాఖ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ధామకూరి శ్రీధర్ అన్నారు. -10లో



స్నేహితుడి కోసం వెళ్లి అనంత లోకాలకు..

కురబలకోట మండలం జంగావారిపల్లె సమీపంలో శుక్రవారం జరిగిన కారు ప్రమాదంలో రాయచోటికి చెందిన షేక్ మహమ్మద్ నవాజ్ మృతి చెందాడు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.114
రెండోరకం	రూ.64	రూ.88

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1780 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

జిల్లాలో వర్షం

రాయచోటి: నైరుతి రుతుపవనాల ప్రభావం జిల్లా వ్యాప్తంగా కనిపిస్తోంది. జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు వర్షం కురిసింది. అత్యధికంగా గాలివీడులో 79.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రాయచోటిలో 32.6, కోడూరులో 30.4, కలికిరిలో 16.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రాయచోటి, మదనపల్లె డివిజన్ పరిధిలో మిగిలిన మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. మదనపల్లె డివిజన్ పరిధిలోని కలికిరిలో మినహా మిగిలిన మండలాల్లో శుక్రవారం ఉదయం వరకు వర్షం కురవలేదు.

నూతన నియామకం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన దిగువ పేర్కొన్న నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో వివిధ హోదాల్లో నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా కె.జదీష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా జి.అనురుధ్ రెడ్డి, ఇర్ఫాన్ షేక్, కె.వినయ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వలంటీర్ల విభాగం కార్యదర్శిగా పి.మురళీమోహన్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా బి.ధర్మారెడ్డిలను నియమించారు.

ఏనుగు హల్‌చల్



ధ్వంసమైన అరటితోట

పీలేరు: మండలంలోని జాండ్ల, గూడరేవుపల్లె పరిసర గ్రామాల్లో ఒంటరి ఏనుగు హల్‌చల్ చేయడంతో ప్రజలు భయాందోళనలో ఉన్నారు. యర్రావారిపాళెం మండలంలో ఫారెస్ట్ అధికారులు సైతం గాయపడ్డారు. ఈ క్రమంలో శుక్రవారం మండలంలోని జాండ్ల పంచాయతీలో ఒంటరి ఏనుగు సంచరించినట్లు గ్రామస్తులు గుర్తించారు. నారుమడి తొక్కిన ఏనుగు అడుగులు, అరటి తోట ధ్వంసం చేసినట్లు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ అధికారులు, పోలీసులు జాండ్లలో పర్యటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

టమాటాకు ప్రత్యామ్నాయ సాగు మేలు



టమాట పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బి.కొత్తకోట: టమాటాకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నష్టాల నుంచి గట్టెక్కాలని కలికిరి కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసులు, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ కే.మాధురీ రైతులను కోరారు. శుక్రవారం మండలంలోని బయ్యప్పగారిపల్లెలో టమాట పంటలను వారు పరిశీలించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టమాట సాగుతో రైతులు తీవ్రనష్టాలను చవిచూస్తున్నారని, దీన్ని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని కోరారు. ఖరీఫ్‌లో సాగు చేసే పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. వేరుకుళ్లు నివారణకు ట్రైకోడర్మా విరిడి అనే జీవ శిలీంద్ర నాశిని వాడాలని సూచించారు. సమావేశంలో ఏడీఏ శివశంకర్, ఏఓ చంద్రశేఖర్, పశువైద్యులు జగన్‌మోహన్, జెడ్పీటీసీ రామచంద్ర, రైతులు పాల్గొన్నారు.

సాగులో శాస్త్రీయత పెంపొందించుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

నందలూరు: రైతులు సాగులో శాస్త్రీయత పెంపొందించుకోవాలని తద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని భారత నూనె గింజల పరిశోధనా శాస్త్రవేత్త ఖురేషి సూచించారు. శుక్రవారం మండలంలోని లేబాక, నల్లతిమ్మయ్యగారిపల్లె గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ద్వారా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ మామిడి తోటల పెంపకంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రామకృష్ణరాజు మాట్లాడుతూ వరి పైరు గురించి వివిధ రకాల విత్తనాలు నారుమడి పెంపకం, ప్రధాన పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి మల్లిఖార్జున,ఉద్యాన అధికారి సురేష్ బాబు, వైపి గిరీష్‌కుమార్, పామాయిల్ పంట అభివృద్ధి అధికారి కొండారెడ్డి పాల్గొన్నారు.

ఆడబిడ్డ నిధికి చంద్రగ్రహణం

- ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి విస్మరించిన కూటమి సర్కార్
- సూపర్‌సిక్స్‌వైపు అడుగులు పడకపోవడంతో అతివల్లో ఆందోళన
- వైఎస్ జగన్ సర్కార్ హయాంలో అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట
- అమ్మ ఒడి, సున్నావడ్డీ, చేయూతతో ఆర్థిక భరోసా



సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికలకు ముందు ఏదీ పడితే అది హామీ ఇచ్చి..అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక పరిస్థితులు బాగా లేవంటూ బాబు నోట అదే మాట పదేపదే వినిపిస్తోంది..ప్రజలు అర్థం చేసుకోవాలంటూ చెబుతూనే మరోవైపు ప్రధాన హామీలను పక్కన పెడుతున్నారు. జగన్ చెప్పాడంటే....చేస్తాడంతే..అదే బాబు చెప్పాడంతే... చేయడంతే...అని జనాలు చెవులు కొరుక్కుంటున్నారు. ప్రమాణ స్వీకార అనంతరం పాలన ప్రారంభించి జూన్ 12కు సరిగ్గా ఏడాదవుతుంది. అయినా ఇచ్చిన హామీలపై కూటమి సర్కార్ ఇంకా అడుగులు ముందుకు వేయకపోవడంపై ప్రజల్లో చర్చకు దారితీస్తోంది. అంతకుముందు 2014లోనూ అధికారంలోకి వచ్చిన బాబు రుణమాఫీతోపాటు అనేక హామీల విషయంలోనూ మాయ చేశారు. మహిళలకు సంబంధించి ఆడబిడ్డ నిధి కింద ప్రతినెల రూ. 1500 అందజేస్తామని చెప్పినా ఊసే లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమన్నా ఇప్పటికీ వాయిదాల పర్వం కొనసాగుతోంది. తల్లికి వందనానికి సంబంధించి ఇప్పటివరకు సొమ్ము అందించలేదు. అదే వైఎస్ జగన్ సర్కార్ హయాంలో మహిళలే మహారాణులుగా...ఒక్క సమయం పెట్టుకుంటే గడువులోపు ఎన్ని కష్టాలున్నా అందించిన పరిస్థితి. పైగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వెనుకంజ వేయకుండా ప్రజలను ఆదుకున్న పరిస్థితులను ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు.

ఆడబిడ్డకు భరోసా ఏదీ?

ఎన్నికలకు ముందు ప్రతి ఇంటిలోని ఆడబిడ్డలను ఆదుకుంటాం..నెలనెల రూ. 1500 చొప్పున అందిస్తామని ఊదరగొట్టిన అధినేత బాబు ప్రస్తుతం ఆడబిడ్డ గురించే మరిచిపోయారు. పాలనా పగ్గాలు చేపట్టి ఏడాదవుతున్నా కనీసం చూస్తాం, చేస్తాం అన్నమాట కూడా రాలేదు. ఆడబిడ్డ నిధి కింద ఒక్కొక్కరికి నెలకు రూ. 1500 చొప్పున వేసుకున్నా ఏడాదికి రూ. 18 వేలు అవుతుంది. ఈ సొమ్ములు మాకెప్పుడు ఇస్తారంటూ ఆడపడుచులు అడుగుతున్నా సమాధానం చెప్పేవారు లేరు. అన్నమయ్య జిల్లాలో సుమారు 3,65,650 మందికి పైగా ఆడబిడ్డలు ఉన్నారని అంచనా. సరాసరిని ఏడాదికి రూ. 658 కోట్లకు పైగా వారికి అందించాల్సిన పరిస్థితి ఉన్నా ప్రభుత్వం ఊసెత్తడం లేదు.

జిల్లాలో ఆడబిడ్డ నిధి వివరాలు

అర్హతగల మహిళలు (అంచనా): 3,65,650

వారికి అందాల్సిన మొత్తం (ఏడాదికి)	ఒక్కొక్కరికి నెలకు అందాల్సిన సొమ్ము
రూ.658.17 కోట్లు	రూ.1500

ఆర్టీసీ బస్సుల్లో ఉచితం ఎప్పుడో?

కూటమి సర్కార్ ఉచిత బస్సు ప్రయాణంపై వాయిదా పర్వం సాగిస్తోంది. అధికారంలోకి వచ్చిన కొత్తలో అదిగో ఇదిగో అంటూ అప్పటికప్పుడు ఉచిత బస్సు ప్రయాణం మొదలు పెడుతున్నట్లు హంగామా చేసినా తర్వాత ముందుకు అడుగు పడలేదు. ప్రతి మహిళకు ఉచిత ప్రయాణమని ఊదరగొట్టినా ఏడాదవుతున్నా..ఉచిత బస్సెక్కే అవకాశం మహిళలకు కల్పించలేదు. జిల్లాలో సుమారు 4,60,000 మంది ఉన్నారు. రోజువారిగా 482 బస్సుల్లో 1.30 లక్షల మంది ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తారు. అయితే అందులో 30 శాతం వేసుకున్నా 30 వేల మంది వరకు మహిళలు ప్రతిరోజు బస్సుల్లో రాకపోకలు సాగిస్తారని అంచనా. రోజుకు ఒక్కొక్క మహిళ సరాసరి రూ. 100 ఛార్జి వేసుకున్నా రూ. 30 లక్షల మేర ఖర్చు వస్తోందని ప్రభుత్వం అమలు చేయకుండా దాట వేస్తోంది.

మహిళలే మహారాణులు

2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం...వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి మహిళలకు పెద్దపీట వేశారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ మొదలుకొని ప్రతి విభాగంలోనూ మహిళలను మహారాణులుగా చూడాలని భావించారు. అందుకు అనుగుణంగా అమ్మ ఒడి, కాపు నేస్తం, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ ఇలా ప్రతీది మహిళలను భాగస్వాములను చేయడంతోపాటు ఆర్థికంగా భరోసా కల్పించారు. అమ్మ ఒడి కింద జిల్లాలోని 1,57,292 మంది విద్యార్థులకు సంబంధించిన తల్లులకు ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున ప్రతి ఏడాది రూ. 235-250 కోట్లు ఖర్చుచేసింది. అంతేకాకుండా జిల్లాలో 60,821 స్వయం సహాయక గ్రూపులు ఉండగా వారికి రూ. 166.04 కోట్లు చొప్పున సున్నా వడ్డీ అందించడం జరిగింది. వైఎస్సార్ చేయూత ద్వారా 79,157 మందికి రూ. 402.82 కోట్లు చొప్పున అందించారు. కాపు నేస్తం కింద 38,821 మంది మహిళలకు రూ. 58.23 కోట్లు, వైఎస్సార్ ఆసరా కింద 22289మందికి రూ. 395.65 కోట్లు చొప్పున అందించి మహిళల మనసుల్లో వైఎస్ జగన్ సర్కార్ చెరగని ముద్ర వేసుకుంది.

ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదు



మేనిఫెస్టోలో చెప్పిన విధంగా హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. 18 ఏళ్లు నిండిన వారికి రూ.1500 ఇస్తామని.. ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పింది. అధికార పగ్గాలు చేపట్టి ఏడాదవుతున్నా వీటి ఊసే లేదు.

-ఎం.సుగుణవేణి, బోస్‌నగర్, రాయచోటి

బాబును నమ్మి మోసపోయాం



గతంలో జగన్ ప్రభుత్వంలో అమ్మఒడి, వైఎస్సార్ చేయూత వంటి పథకాలు అందేవి. కూటమి ప్రభుత్వంలో మహిళలకు ఇస్తామన్న ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. చంద్రబాబును నమ్మి మోసపోయాం.

-వి.పద్మావతి, అప్పయ్యరాజుపేట పంచాయతీ

మాట తప్పారు



ఆడబిడ్డ నిధి పథకం అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు మాట తప్పారు. పథకాలను నమ్మి ఓట్లు వేశాం. ఆర్థిక సహాయం అందిస్తే కుటుంబానికి ఆసరాగా ఉంటుందని ఆశించిన మహిళలు మోసపోయారు.

-సుకన్య, పెద్ద మాదిగపల్లె, నిమ్మనపల్లె

ఉచిత బస్సు ప్రయాణం

జిల్లాలో ఆర్టీసీ బస్సు డిపోలు:	05
రోజువారిగా తిరిగే బస్సులు:	482
అందులో ప్రయాణించే వారు:	1.30 లక్షలు
అందులో మహిళా ప్రయాణీకులు:	30 వేలు
ఒక్కో మహిళపై రోజుకు రూ. 100 చార్జి అనుకున్నా.. రూ.	30 లక్షలు

గత ప్రభుత్వంలో అన్ని పథకాలు అందేవి



గత ప్రభుత్వంలో అమ్మ ఒడి, డ్వాక్రాలో సున్నా వడ్డీ ద్వారా ప్రతి ఏడాది లబ్ధి చేకూరేది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదవుతున్నా ఇప్పటి వరకు మహిళలకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదు.వెంటనే హామీల అమలుకు చర్యలు తీసుకోవాలి.

- వెంకటసుబ్బమ్మ, సుండుపల్లె

అధికారిక కార్యక్రమాల్లో టీడీపీ కార్యకర్తలా?

- మదనపల్లె మున్సిపాలిటీలో 33 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు
- పిలవద్దంటూ సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి
- ప్రతినెలా ఒకటిన పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

మదనపల్లె: ప్రజలతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఏస్థాయి వారైనా ఆ ప్రాంతాల్లో వారికి కల్పించిన హక్కు మేరకు అధికారిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పించడం అనవాయితీ. అభివృద్ధి పనులైనా, సమస్యల పరిష్కారంలోనైనా వారికి అవకాశం ఇవ్వాలి. మదనపల్లె మున్సిపాలిటీలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు కాకున్నా అధికారులు రెడ్ కార్పెట్ వేసి మర్యాదలు చేస్తున్నారు. ప్రతినెలా ఒకట తేదీ పింఛన్ల పంపిణీ నుంచి ప్రతి కార్యక్రమంలోనూ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను కాదని ప్రాధాన్యత ఇస్తున్నారు.

కౌన్సిలర్ల స్థానంలో కార్యకర్తలు: 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మదనపల్లె మున్సిపాలిటీలో 35 వార్డులకు ఎన్నికలు నిర్వహించగా పట్టణ ప్రజలు 33 మందిని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లుగా గెలిపించారు. టీడీపీ రెండు కౌన్సిలర్లను గెలుచుకుంది. పట్టణ ప్రజల్లో వైఎస్సార్‌సీపీ ఆదరణను కూటమి ప్రభుత్వం వచ్చాక జీర్ణించుకోలేని టీడీపీ నేతలు..ఆ కౌన్సిలర్లు లేని వార్డుల్లో అధికారం చెలాయిస్తున్నారు. మదనపల్లె పట్టణంలో 10,715 పింఛన్లు ఉన్నాయి. వీటిని ఆయా వార్డుల కౌన్సిలర్లను ఆహ్వానించి వారి ద్వారా పంపిణీ చేయించాలి. అయితే టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఒకటో తేదిన లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేస్తూ హడావుడి చేస్తున్నారు. పింఛన్లు తామే ఇస్తున్నట్టుగా ప్రచారం చేసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యక్రమంలో అనధికారుల పాత్ర ఉండదని అధికారులకు తెలిసినా ప్రతినెలా కొనసాగుతూనే ఉంది.

ఇన్‌చార్జీలు చెప్పినట్టే చేయాలట

వార్డులకు టీడీపీ ఇన్‌చార్జులుగా చెప్పుకుంటున్న వాళ్లు చెప్పినట్టే చేయాలంటూ కొందరు సచివాలయ ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఇటీవల పింఛన్ల పంపిణీకి వస్తున్న వైఎస్సార్‌సీపీకి చెందిన ఓ మహిళా కౌన్సిలర్‌ని రానివ్వద్దంటూ టీడీపీ వార్డు ఇన్‌చార్జి ఒత్తిడి చేశారని సచివాలయ ఉద్యోగి కౌన్సిలర్‌తో తనగోడు చెప్పుకున్నాడు. ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కాగా అధికారులు శనివారం పింఛన్లను టీడీపీ శ్రేణులతో పంపిణీ చేయిస్తారా లేక కౌన్సిలర్ల ద్వారా చేయిస్తారో చూడాలి.

1న కడపలో క్యారమ్స్ పోటీలు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా స్థాయిలో జూన్ 1న క్యారమ్స్ గేమ్ టోర్నమెంట్‌ను కడప డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కడప జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ సెక్రటరీ రాజి, కోచ్ గణేష్‌బాబు, కృష్ణయ్య తెలిపారు. అండర్ 11, 14, 17, 19 బాలురు, బాలికలు, సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ కేటగిరీల్లో పోటీలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్: 8297059998కు సంప్రదించాలని వివరించారు.

1న బాస్కెట్‌బాల్ ఎంపికలు

కడప జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1న 6.30 గంటలకు కడప జయనగర్ జెడ్పీ బాలికల హైస్కూల్‌లో అండర్ 23 బాస్కెట్‌బాల్ స్త్రీ, పురుషుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు సహదేవరెడ్డి తెలిపారు. 2002 జూన్ 1వ తేదీ తర్వాత పుట్టిన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

కలికిరి(వాల్మీకిపురం): స్థానిక పట్టాభిరామాలయంలో శుక్రవారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శుక్రవారం సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ జరిపారు. అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సాంప్రదాయబద్ధంగా తీసుకెళ్లి ఆశీనులను చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. చివరగా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారి కృష్ణమూర్తి, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



కడపకు తిరుమల సెలవు!

- గుంతకల్‌కు పొడిగింపు
- 2న పట్టాలెక్కనున్న గుంతకల్ రైలు

రాజంపేట: తిరుమల ఎక్స్‌ప్రెస్(17487/88) రైలు ఇక కడపకు సెలవు చెప్పింది. వచ్చే నెల 2వ తేదీ నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు కడప నుంచి గుంతకల్ ఎక్స్‌ప్రెస్(స్పెషల్)రైలుగా మారనుంది. అయితే పార్మిసిన్‌లో ఉన్న ఏసీ బోగీలను మూసివేస్తారు. ఈరైలు అన్‌రిజర్వ్‌డ్‌గా నడవటం వల్ల కేవలం రిజర్వేషన్, జనరల్ బోగీలు మాత్రం ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. 07521/07522 నంబర్లతో తిరుమలను గుంతకల్‌రైలుగా నడిపిస్తున్నారు.ఉభయ అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, గుంతకల్ వెళ్లేందుకు ఉభయ వైఎస్సార్ కడప జిల్లా వాసులకు ఉపయోగకరమవుతుంది.

తిరుమలకు వెంటాడుతున్న లాంగ్‌ట్రైన్ కష్టాలు

సర్కారు ఏరియాకు ఉన్న ఏకైక ఎక్స్‌ప్రెస్ రైలును డివిజన్ కేంద్రానికి తరలించేశారు. ఇప్పటికే కడప రైల్వేలకు అన్ని విధాలుగా అన్యాయం జరుగుతోందన్న విమర్శలు రైల్వేశాఖను తాకుతున్నాయి. విశాఖ-తిరుపతి మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును కడప వరకు పొడిగింపు జిల్లా ప్రయాణికులకు ఊరటే . ఇప్పుడు ఆరైలును డివిజన్ కేంద్రమైన గుంతకల్ వరకు పొడిగించాలనే అధికారులు చేసిన ప్రతిపాదనలు అమలయ్యాయి. తిరుమలకు లాంగ్‌ట్రైన్ కష్టాలు వెంటాడునన్నాయి. తిరుమల రైలు పొడిగింపును సాక్షి ముందుగానే వెలువరించిన సంగతి విధితమే.

- తిరుమల ఎక్స్‌ప్రెస్ ఇప్పటి వరకు 872 కిలోమీటర్ వరకు పొడిగింపుతో నడిచేది. గుంతకల్ పొడిగింపుతో అది కాస్తా 184 కి.మీ దూరం పెరిగింది. దీంతో 1056 కి.మీ దూరం నడుస్తోంది. తిరుమల ఫార్మసిన్‌కు గుంతకల్‌లో క్లీనింగ్, వాటరింగ్ నిర్వహించనున్నారు.అప్, డౌన్ 2, 112 కిలోమీటర్ల దూరం తిరుమల రైలు రన్నింగ్ కొనసాగనుంది.

గుంతకల్ రైలుగా నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్

హాల్టింగ్స్ ఇలా..: గుంతకల్ ఎక్స్‌ప్రెస్ రైలు కడప నుంచి ప్రారంభమవుతుంది. ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి, గుంతకల్‌లో హాల్టింగ్స్ ఇచ్చారు. ఈ రైలు కడపలో ఉదయం 7.45 గంటలకు బయలుదేరి, ఎర్రగుంట్లకు 8.13 గంటలకు, కొండాపురానికి 08.39కి చేరుకుంటుంది. తాడిపత్రికి 9.15, గుత్తి 10.03, గుంతకల్‌కు 11.15 గంటలకు చేరుకుంటుంది. తిరిగి గుంతకల్‌లో 1.30గంటలకు బయలుదేరుతుంది. గుత్తికి 01.55 గంటలకు చేరుకుంటుంది. తాడిపత్రికి 02.40గంటలకు, కొండాపురానికి 03.13గంటలకు చేరుకుంటుంది. 3.43 గంటలకు ఎర్రగుంట్ల , కడప 5.15 గంటలకు చేరుకుంది. అక్కడి నుంచి తిరుమల రైలుగా విశాఖకు బయలుదేరుతుంది.

- డివిజన్ కేంద్రమైన గుంతకల్‌కు వెళ్లేందుకు రైల్వే ఉద్యోగులకు, కార్మికులకు గుంతకల్ ఎక్స్‌ప్రెస్ రైలు అనుకూలమని అంటున్నారు. అలాగే తాడిపత్రి, గుంతకల్ వెళ్లే ప్రయాణికులకు ఇంటర్‌సిటీ కాకుండా ఈ రైలులో వెళ్లే పరిస్థితులే అధికంగా ఉంటాయి.

కడప నుంచి గుంతకల్ రైలుగా..

జిల్లా కేంద్రం నుంచి ఏకైక ఎక్స్‌ప్రెస్ రైలు తిరుమల ఎక్స్‌ప్రెస్. ఇప్పుడు అది గుంతకల్ వరకు వెళుతోంది. గుంతకల్ నుంచి సర్కారు ప్రాంతా నికి అనేక రైళ్లు ఉన్నాయి. సర్కారు ప్రాంతానికి ఇప్పుడు కడప నుంచి నడిచే ఏకైక ఎక్స్‌ప్రెస్ రైలును కూడా గుంతకల్‌కు తీసుకెళ్లడంపై ఉభయజిల్లా వాసుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

బైక్‌పై నుంచి పడి మహిళకు తీవ్రగాయాలు

మదనపల్లె రూరల్ : బైక్‌పై నుంచి పడి మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. పీటీయంకు చెందిన ఇమ్రాన్‌బాషా భార్య హసీనా(48) కుమారుడు ముజాహిద్దీన్‌తో కలిసి మదనపల్లెకు ద్విచక్రవాహనంలో వస్తుండగా, మార్గమధ్యంలోని కురబలకోట మండలం దొమ్మన్నబావి వద్ద ఆమె కట్టుకున్న చీర బైక్ వెనుకచక్రంలో చిక్కుకుపోవడంతో అదుపు తప్పి వాహనంపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికుల సహాయంతో కుమారుడు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

మదనపల్లె రూరల్ : అదనపు కట్నం, కానుకల కోసం వేధిస్తున్న ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ తెలిపారు. మదనపల్లె పట్టణం తాళ్లసుబ్బన్న వీధికి చెందిన నజీరుల్లా, జుబేదా దంపతుల కుమార్తె ముస్కాన్(22)ను కర్ణాటక ఆర్‌కే.పురంకు చెందిన జలీల్‌అహ్మద్, షహీనా దంపతుల కుమారుడు షేక్ సల్మాన్‌కు ఇచ్చి 2022లో వివాహం జరిపించారు. ఏడాది నుంచి భర్త సల్మాన్, అత్త షహీనా, మేనత్త ఘాజియాలు అదనపు కట్నంతో పాటు బైక్ కొనివ్వాలని వేధించడం మొదలుపెట్టారు. దీంతో భరించలేక నెలరోజుల క్రితం ముస్కాన్ పుట్టింటికి వచ్చేసింది. విషయం తల్లిదండ్రులకు తెలిపి వారి సహాయంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. దీంతో నిందితులు ముగ్గురిపై కేసు నమోదుచేసి హెడ్‌కానిస్టేబుల్ చంద్రరాజు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎనిమిది హోటళ్లకు జరిమానా



హోటళ్లను తనిఖీ చేస్తున్న జిల్లా ఆహార భద్రత అధికారి షమీమ్ బాషా

రాయచోటి టౌన్ : పట్టణంలో నాసిరకం ఆహారం విక్రయిస్తున్న ఎనిమిది హోటళ్ల యజమానులకు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ రూ.19,000 జరిమానా విధించారు. హోటళ్లలో నాసిరకం ఆహారం విక్రయించడం, మళ్లీ మళ్లీ వాడిన నూనెలనే వాడుతున్న హోటళ్లు, బేకరిలలో, నిత్యావసర వస్తువులు అమ్ముతున్న వారిని, మినరల్ వాటర్ ప్లాంట్‌లు, వడ్డించే ప్రదేశం అపరిశుభ్రంగా ఉండటం వంటి వాటిని పరిశీలించి వాటిపై జిల్లా ఆహార భద్రత అధికారి డాక్టర్ కె.షమీమ్ బాష తనిఖీ చేశారు. వీటిపై జాయింట్ కలెక్టర్‌కు నివేదక ఇవ్వడంతో ఆయన జరిమానా విధించారు.

సెల్ టవర్‌పై నుంచి కిందపడి యువకుడి మృతి



మృతి చెందిన శివసాయి

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలోని దొండపాడు రస్తాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి ముద్ద శివసాయి(27) అనే యువకుడు మృతి చెందాడు. శుక్రవారం ఉదయం శివసాయి సెల్ టవర్ ఎక్కి పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు తాడు విరిగిపోవడంతో కింద పడి మరణించినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడు శివసాయి వేంపల్లి మండలం అలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు. ఎర్రగుంట్ల పోలీసులు మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఆరోగ్యానికి పొగబెడుతుంది

- ధూమపానంతో ఆరోగ్యం 'ఉఫ్'
- బీడీ, సిగరెట్, గుట్కాలతో అనేక అనర్థాలు
- పలు రకాల వ్యాధులకు కారణం అవుతున్న పొగాకు వినియోగం
- జీర్ణకోశ, ఊపిరితిత్తుల సమస్యలతో పాటు కేన్సర్
- గుండె, మెదడుకు కూడా చేటు
- పొగాకుకు బానిసలవుతున్న యువత
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం



రాజంపేట టౌన్ : పొగాకును ఏ రూపంలో తీసుకున్నా ఆరోగ్యానికి తీవ్రమైన నష్టం చేకూర్చుతుంది. ఊపిరితిత్తుల సమస్యతో పాటు గుండె జబ్బులు, పలు రకాల కేన్సర్‌లు, పక్షవాతం వంటి సమస్యలు పొగతాగే వారిలో ఎక్కువగా వస్తాయి. ఈ విషయాలను పరిశీలించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏడాది మే 31వ తేదీ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని జరపాలని తీర్మానించింది. అందులో భాగంగా 1988వ సంవత్సరం నుంచి పొగాకు వల్ల కలిగే అనర్థాలపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

పొగాకును ఏ రూపంలో సేవించినా ప్రమాదమే..

పొగ పగ సాధిస్తుంది. సరదా..సరదా సిగరెట్టు అనారోగ్యానికి తొలిమెట్టులా మారిపోతుంది. ఎంత ఒత్తిడి నుంచైనా సిగరెట్, బీడీ ఉపశమనం కలిగిస్తాయని, అవిలేనిదే జీవితం లేదని గొప్పలు చెప్పే పొగరాయుళ్లు వైద్యులు చెప్పే విషయాలు వింటే గుండె జారడం మాత్రం ఖాయం. ధూమపానం వల్ల శరీరంలోని కొన్ని భాగాలు బాగా దెబ్బ తినిపోతాయి. ఆ విషయం తెలుసుకునేలోపే సిగరెట్, బీడి పొగలాగే మనిషి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని వైద్యులు చెబుతున్నారు. సిగరెట్, గుట్కా, ఖైని, పానమసాల పేరు ఏదైనా పొగాకును ఏ రూపంలో సేవించినా ప్రమాదమే అంటున్నారు వైద్యులు. ఒక సిగరెట్‌లో నాలుగు వందలకు పైగా హానికర విషరసాయనాలు ఉంటాయి. అందులో 48 కంటే ఎక్కువ క్యాన్సర్ కారకాలు ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. పొగాకు వల్ల ముఖ్యంగా ఊపిరితిత్తులు, గొంతు, దవడ, పెదాలు వంటి భాగాలకు క్యాన్సర్ సులువుగా సంక్రమిస్తుంది. ధూమపానం చేసే వ్యక్తి తనకు మాత్రమే కాకుండా తనచుట్టూ ఉండేవారి ఊపిరితిత్తుల్లో 25 శాతం విషవాయువును పంపుతూ వారి అనారోగ్యానికి కారణమవుతున్నాడు. పొగను పీల్చడం వల్ల కూడా దేశంలో ప్రతి ఏటా అనేక మంది మృత్యువాత పడుతున్నట్లు అంచనా. రోజు రోజుకు మహమ్మారిగా మారుతున్న ఈ విషవాయువు అలవాటుకు ప్రజలు దూరంగా ఉండాల్సిన అవసరం ఎంతైనావుంది. మనిషి అనుకుంటే ఏదైనా సాధించగలడు అందువల్ల ధృడ సంకల్పంతో ఈ అలవాటును దూరం చేసుకోవడం పెద్ద విషయం కాదంటున్నారు వైద్యులు.

ధూమపానంతో కలిగే రుగ్మతలివే

- పొగతాగడం వల్ల గొంతు, ఊపిరితిత్తులు, కడుపు, మూత్రపిండాల కేన్సర్ సోకే ప్రమాదముంది
- గుండె రక్తనాళాలు బిరుసుగా మారి గుండెపోటుకు దారితీస్తుంది
- నాడి సంబంధ వ్యాధులు, పక్షవాతానికి దారి తీస్తుంది
- మధుమేహం, రక్తపోటు, మానసిక రుగ్మతలకు కారణమవుతుంది
- దీర్ఘకాలిక వ్యాధులకు వాడే మందులపై ప్రభావం చూపుతుంది
- శారీరక సామర్థ్యం, ఎముకల పటుత్వం తగ్గుతుంది

ఇలా చేస్తే ధూమపానానికి దూరం కావచ్చు

- ధూమపానం అలవాటు ఉన్న వారు వారి వద్ద సిగిరెట్, బీడి, గుట్కా వంటి వాటిని ఉంచుకోకూడదు
- పొగాకు అలవాటు ఉన్న వ్యక్తులకు కొంత కాలం దూరంగా ఉండాలి
- పొగాకు సేవించడం సంపూర్ణంగా వదిలిన నాడే సంపూర్ణ ఆరోగ్యం పొందగలమన్న నిజాన్ని నిరంతరం గుర్తుంచుకోవాలి
- ధూమపానం లేక గుట్కా వంటివి వేసుకోవాలనిపించినప్పుడల్లా లవంగాలు యాలకులు వంటి వాటిని తీసుకున్నట్టయితే తాత్కాలికంగా ఉపశమనం పొందవచ్చు
- ఆరంభంలో నాలుగు వారాలు, ఆ తరువాత ఆరువారాల పాటు ఇలాంటి ప్రయత్నం చేసి నెమ్మదిగా పొగాకు అలవాటు నుంచి శాశ్విత విముక్తి పొందవచ్చు
- ఆధ్యాత్మిక జీవనాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా కూడా ధూమపానానికి, గుట్కా వంటి అలవాట్లకు దూరం కావచ్చు

ఆరోగ్య సమస్యలు కొని తెచ్చుకున్నట్లే



పొగాకును ఏరూపంలో తీసుకున్నా జబ్బులను కొనితెచ్చుకున్నట్లే. చాలా మంది యువకులు సరదా కోసం సిగరెట్ తాగడం అలవాటు చేసుకొని ఆ తర్వాత సిగరెట్ తాగడాన్ని మానుకోలేక చిన్న వయస్సులోనే అనారోగ్యాల భారీన పడుతున్నారు. అందువల్ల ఎవరు కూడా సిగరెట్, బీడీ, గుట్కా వంటివి వాటిని ఎట్టి పరిస్థితుల్లో అలవాటు చేసుకోకూడదు. అలవాటు చేసుకున్న వారు ఎలాగైనా ఆ అలవాట్లను మానుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారు.

– డాక్టర్ పాలనేని వెంకట నాగేశ్వరరాజు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, రాజంపేట

స్నేహితుడి కోసం వెళ్లి అనంత లోకాలకు..

- డివైడర్‌ను ఢీకొని కార్డు బోల్తా
- ఒక్కరు మృతి, నలుగురికి గాయాలు
- రాయచోటిలో విషాదం





జంగావారిపల్లె దగ్గర పొలాల్లోకి దూసుకెళ్లిన కారు (ఇన్‌సెట్) మహమ్మద్ నవాజ్ (ఫైల్)

కురబలకోట : కురబలకోట మండలం జంగావారిపల్లె సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన కారు ప్రమాదంలో రాయచోటికి చెందిన యువకుడు షేక్ మహమ్మద్ నవాజ్ (23) మృతి చెందాడు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు..రాయచోటికి చెందిన సుహేల్ (24) కువైట్‌లో పని చేస్తూ స్వగ్రామం రాయచోటికి రావడానికి శుక్రవారం బెంగళూరు ఎయిర్ పోర్టులో దిగారు. ఇతన్ని తీసుకు రావడానికి రాయచోటికి చెందిన ఇతని స్నేహితులు మహమ్మద్ అలీ ఖాన్ (23), డ్రైవర్ ముజిమిల్ (24), ఖాదర్ బాషా (24), షేక్ మహమ్మద్ నవాజ్ (24) వెళ్లారు. వీరి స్నేహితుడు సుహేల్‌తో పాటు కారులో రాయచోటికి వస్తుండగా మార్గమధ్యంలో మండలంలోని జంగావారిపల్లె వద్ద రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారు ఒక్కసారిగా అదుపు తప్పి ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. రెప్పపాటులో జరిగిన ఈ సంఘటనలో షేక్ మహమ్మద్ నవాజ్ (24) మృతి చెందాడు. మిగిలిన వారికి గాయాలయ్యాయి. వీరిని 108 వాహనం హుటాహుటిన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో మృత దేహాన్ని రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. రాయచోటిలో తీవ్ర విషాదం నెలకొంది.

వీడియో అనలిస్ట్‌గా వాల్మీకిపురం క్రీడాకారుడు

- సాధారణ కుటుంబం నుంచి ఎదిగిన వైనం
- స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న సంపత్ క్రీడా ప్రస్థానం



శేషాద్రి సంపత్

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం పట్టణం తోటవీధిలో నివాసం ఉంటున్న శేషాద్రి ఆదినారాయణ, విజయలక్ష్మీ దంపతులు స్థానిక ఓ జనరల్ దుఖాణం నిర్వహిస్తున్నారు. వీరి కుమారుడు శేషాద్రి సంపత్ చిన్ననాటి నుంచి క్రికెట్‌పై మక్కువతో ఉండేవాడు. స్థానికంగా జీసీసీసీలో జరిగే క్రికెట్ పోటీలలో పాల్గొని సత్తాచాటుతూ వచ్చారు. అయితే క్రికెట్‌తో పాటు ఎదుటి వారి ఆటను అంచనా వేయడంపై దృష్టి సారించి, ఎంచుకున్న విభిన్న పంతాలో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి 2023 సంవత్సరంలో అమెరికా జాతీయ క్రికెట్ జట్టులో ఫర్మార్మెన్స్, వీడియో అనలిస్ట్‌గా చేరడం అతని జీవితాన్ని మలుపు తిప్పినట్లెంది. యూఎస్ఏ క్రికెట్ జట్టు ఐసీసీ వరల్డ్‌కప్ లీగ్–2లో అగ్రస్థానంలో నిలిచి, 2027 వరల్డ్ కప్ అర్హత సాధించడానికి ముందుకెళ్ళడంలో సంపత్ విశ్లేషణా సామర్థ్యం కీలకంగా మారింది. యూఎస్ఏ తో పాటు బర్ముడా, ఇటలీ వంటి జాతీయ జట్లుతో ఫ్రాంచైజీ లీగ్ లలో కూడా సంపత్ వీడియో అనలిస్ట్‌గా సేవలందిచాడు. క్రికెట్ దిగ్గజాలైన రాబిన్ సింగ్, ఓవైస్ షా, కెవిన్ ఓ బ్రియన్, జూలియన్‌వుడ్ వంటి వారితో కలిసి పనిచేసినట్లు సంపత్ తెలిపారు. పట్టణానికి చెందిన శేషాద్రి సంపత్ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తుండటంతో తల్లిదండ్రులతో పాటు పట్టణ వాసులు హర్షం వ్యక్తపరుస్తున్నారు. ఎంచుకున్న వృత్తిలో అంకిత భావంతో పని చేసి ముందు కెళ్ళడమే చిన్ననాటి నుంచి సంపత్‌కు అలవాటని తల్లిదండ్రులు అంటున్నారు. క్రీడారంగంలో రాణించడానికి స్థానికులకు సంపత్ స్ఫూర్తిదాయకమని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ఖరీఫ్ సాగుకు సమాయత్తం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్

లక్కిరెడ్డిపల్లి : ఖరీఫ్ సాగుకు రైతులను సమాయత్తం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని లక్కిరెడ్డిపల్లి, అనంతపల్లి రైతు సేవా కేంద్రాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కడపకు చెందిన కేవీకే శాస్త్రవేత్తలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ మాట్లాడుతూ వేరుశనగ సాగు చేసుకునే రైతులు ఈ ఏడాది కదిరి, లేపాక్షి, విశిష్ట రకం వంటి విత్తనాలు సాగు చేసుకుంటే అనువుగా ఉండటంతోపాటు మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు ప్రతి ఏడాది వరి, వేరుశనగే కాకుండా పప్పు ధాన్యాలు పంటలైన కంది, ఉలవ, అలసంద, పెసలు, మినుముల సాగుపై మక్కువ చూపాలన్నారు. కేంద్ర నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త బసవరాజ్ మాట్లాడుతూ ఆముదంలో ఐసీహెచ్–5,6 అనే రకాలు తొంబై రోజులకే కాపునకు వస్తాయన్నారు. ఉద్యానశాఖ అధికారిణి నాగమణి మాట్లాడుతూ పండ్లతోటల సాగుపై ఆసక్తి ఉన్న రైతులు రైతుసేవా కేంద్రాలలోని సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటమోహన్, ఏడీఏ జయరాణి, కెవికె శాస్త్రవేత్త శిల్పకళ, ఏఈఓలు కెరోలిన్, అంజనమ్మ, విహెచ్ఏలు సాయి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పొలంలో దౌర్జన్యంగా దారి ఏర్పాటు



దౌర్జన్యంగా దారి ఏర్పాటు చేస్తున్న దృశ్యం



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని చియ్యవరం పంచాయతీ వడ్డిపల్లికి చెందిన చంద్రగిరి వెంకటేష్, లక్ష్మీదేవమ్మల కుటుంబానికి 639–4లో 3.81 సెంట్లు మామిడి తోట ఉంది. వారి పొలం పక్కన ఉన్న రఘురామయ్య, రామచంద్రయ్యలు గత కొంత కాలంగా తమ పొలానికి వేరే దారి ఉన్నా రోడ్డుపై నుండి తమ పొలానికి దారి ఉందని శుక్రవారం రెండు జేసీబీలతో దౌర్జన్యంగా , కూటమి నాయకులు, అధికారులు, పోలీసుల అండతో 70 శాతం దారి ఏర్పాటు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. తాము అడ్డుకొనే ప్రయత్నం చేసినప్పటికీ పోలీసుల అండతో దారి ఏర్పాటు చేస్తున్నారని వాపోయారు. కోర్టు ఆర్డరు ప్రకారం రైతులను ఇబ్బంది పెట్టకుండా వారు ఇచ్చిన చోట పరిహారం చెల్లించాలి అని ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపినా ఫలితం లేదన్నారు. తహసీల్దార్ తమ మాట వినకుండా వెళ్లిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుక్రితం సబ్ కలెక్టర్‌కు విన్నవించామని అయినప్పటికీ పోలీసులు, రెవెన్యూ అధికారుల అండతో పనులు చేసుకొంటున్నారని పేర్కొన్నారు. ఉన్న 3.80 సెంట్లలో వారికి దారి ఇస్తే తమ పరిస్థితి ఏంటని వారు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమని వాపోయారు.

సదరన్ సర్టిఫికెట్ల పరిశీలన



దివ్యాంగులను పరీక్షిస్తున్న డాక్టర్ మాధవరెడ్డి

రాయచోటి టౌన్ : దివ్యాంగులకు అందిస్తున్న పింఛన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సదరన్ సర్టిఫికెట్లను పరిశీలన నిర్వహిస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం రాయచోటిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి దివ్యాంగుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, అంతకు ముందుగా వారి వద్ద ఉన్న సదరన్ సర్టిఫికెట్‌ల జీరాక్స్‌ను కూడా పొందుపరిచి భౌతికంగా డాక్టర్ మాధవరెడ్డి పరిశీలించారు. నకిలీ సర్టిఫికెట్లు పొంది పింఛన్ పొందుతున్నారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ తనిఖీల నిర్వహణ చేపట్టారు. దీంతో ఆస్పత్రికి వచ్చిన వారిని భౌతికంగా పరిశీలించి వారికి ఇచ్చిన పర్సెంటేజ్‌ను సవరిస్తున్నారు. కార్యక్రమాన్ని డాక్టర్ బండారు కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.

రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బి ప్లస్ గ్రేడ్



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) నుంచి బీ ప్లస్ గ్రేడ్ గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. న్యాక్ బృందం కళాశాల విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల నైపుణ్యం, పరిశోధన, విద్యార్థుల పురోగతి వంటి అంశాలను సమీక్షించి ఈ గ్రేడ్‌ను మంజూరు చేసిందని ప్రిన్సిపల్ తెలిపార. భవిష్యత్తులో మరింత ఉన్నత ప్రమాణాలను సాధించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ విజయంతో కళాశాల విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి





గాయపడిన శివయ్య, వెంకటరమణమ్మ

సంబేపల్లె : అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం శెట్టిపల్లె పంచాయతీ డీసీ వడ్డిపల్లెకు చెందిన కుంచపు శివయ్య, వెంకట్రమణమ్మలపై అదే గ్రామానికి చెందిన అధికారపార్టీ నాయకులు దాడి చేశారు. స్థానికుల కథనం మేరకు గతంలో జరిగిన ఎన్నికల్లో శివయ్య, వెంకటరమణమ్మలు వైఎస్సార్‌పీకి మద్దతుగా నిలిచారన్న కసితో అధికారపార్టీ నాయకుల అండతో అదే గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్తలు భాస్కర్‌తో పాటు మరో నలుగురు శివయ్య, వెంకటరమణమ్మలపై గురువారం దాడి చేశారు. శివయ్య కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. దాడిపై శివయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.భాస్కర్, మరో వ్యక్తి కలిసి శుక్రవారం శివవయ్యపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై శుక్రవారం పోలీసులను వివరణకోరగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకం

కడప ఎడ్యుకేషన్ : ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్–2025లో మార్షల్ ఆర్ట్స్(పెన్–కాక్ సిలాట్)లో కడప బాలాజీ ఎంబీఏ కళాశాల విద్యార్థి జాన్ బెన్ని బంగారు పతకం సాధించినట్లు కరస్పాండెంట్ లేవాకు నితీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జేఎన్‌టీయూ యూనివర్సిటీ తరఫున బాలాజీ ఎంబీఏ కళాశాల విద్యార్థి బంగారు పతకం సాధించడం తమకెంతో గర్వకారణమన్నారు. ఇందుకు విద్యార్థికి రూ. 10 వేలు నగదుతో సత్కరించామని తెలిపారు.

అన్నమాచార్య యూనివర్సిటీ ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదల



అన్నమాచార్య యూనివర్సిటీ ప్రవేశపరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న ప్రోచాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి తదితరులు

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు యూనవర్సిటీ ప్రొచాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఏయూలోని తన చాంబరులో ఏయూఈటీ –2025 మొదటి దశ ప్రవేశ ఫలితాలను ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూఈటీ ప్రవేశపరీక్ష ఈనెల 15న నిర్వహించామన్నారు. పరీక్షను మొత్తం 1908 మంది విద్యార్థులు రాశారన్నారు. అందులో 1239 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. అర్హత సాధించిన విద్యార్థుల కోసం జూన్ 5, 6, 9, 10 తేదీలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అన్నమచార్య యూనివర్సిటీ జిల్లాలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందన్నారు. కార్యక్రమంలో వీసీ డా.సాయిబాబా, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ నారాయణ, డా.జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని సర్వజన ఆసుపత్రికి తీవ్ర ఆనారోగ్యంతో బత్తల చిన్నా (35) అనే పేరుతో ఈనెల 28న ఓ వ్యక్తిని వైద్యం కోసం చేర్పించారు. అతడు శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అతని ఆచూకీ తెలిసిన వారు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



జిల్లాలో డ్రగ్స్ నియంత్రణపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : అన్నమయ్య జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేలా అధికారులు, పోలీసు శాఖ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫిరెన్సు హాల్‌లో నేషనల్ నార్కోటిక్స్ కో–ఆర్డినేషన్ జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ముందుగా జిల్లా అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి ఆజెండా అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు. ప్రధానంగా మాదకద్రవ్యాల నియంత్రణకు జిల్లాలో తీసుకోవాల్సిన అంశాలను కమిటీలో వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అలవాటుకు ఎవరూ బానిసలు కారాదని, ముఖ్యంగా యువత మేలుకొని డ్రగ్స్‌ను వదులుకోవాలని, తమ భవిష్యత్తును మంచిగా మలుచుకోవాలని కలెక్టర్ సూచించారు. వైద్య, ఆరోగ్యం, రెవెన్యూ, విద్య, అటవీ , డ్రగ్ తదితర శాఖల అధికారులందరూ పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. డిగ్రీ, ఇంటర్మీడియట్ కాలేజీల ప్రిన్సిపాల్స్, ఎంఈఓలతో అవగాహన కార్యక్రమాలు చేయాలన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి చెప్పేలా ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు.

300 కిలోల గంజాయి స్వాధీనం

జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లి డివిజన్లలో 2024, 2025లో ఇప్పటి వరకు మొత్తం 26 డ్రగ్స్ కేసులను రిజిస్టర్ చేసి సుమారు 300 కిలోల గంజాయి పట్టుకున్నట్లు అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి తెలిపారు. అలాగే 40 మంది నిందితులను గుర్తించామన్నారు. 11 మంది రిటైలర్లు, 20 మంది సెల్లర్స్, 99 మంది వినియోగదారులను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్లు 1972, 1933 లేదా 7382296118కు ఎవరైనా ఫోన్ చేసి సమాచారం తెలపవచ్చన్నారు. అనంతరం అధికారులతో కలిసి డ్రగ్స్, గంజాయి నివారణ టోల్ ఫ్రీ నెంబర్లపైప్రచార కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా ఎక్సైజ్ అధికారి మధుసూదన్, అటవీ, వైద్య, విద్య, డ్రగ్స్ కంట్రోల్, వివిధ శాఖల అధికారులు, ఐటిఐ, పాఠశాలల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ రిజిస్ట్రేషన్స్ పెంచాలి

జిల్లాలో పీఎం సూర్యఘర్ రిజిస్ట్రేషన్స్ పెంచాలని కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి యోగాంధ్ర-2025 క్యాంపెయిన్, పీఎం సూర్యఘర్ సానుకూల ప్రజా అవగాహన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయా అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫిరెన్సు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్స్ ఎక్కువ సంఖ్యలో నమోదు అయ్యేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 51 వేల మంది రిజిస్టర్ కాగా ఎక్కువశాతం ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని పేర్కొన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, ప్రజలు నిత్య జీవితంలో యోగా కూడా ఒక భాగం అయ్యేలా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.